### పెట్టుబడ సాయమేదీ?



ఇచ్చిన మాట ప్రకారంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల రైతుభరోసా ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, మందులు సకాలంలో అందించారు. ప్రతి ఏటా పంట సాయం కచ్చితంగా ఇచ్చారు. కొత్త ప్రభుత్వం వచ్చినా నేటికీ రైతుకు పెట్టుబడి సాయం అందించడం లేదు. వెంటనే పెట్టుబడి సాయం అందిస్తే మేలు. – నరేంద్రరెడ్డి, బందేపల్లి, చిలమత్తూరు

### తల్లికి వందనం వర్తింపజేయాలి



నా కుమారుడు ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో అమ్మఒడి పథకం కింద రూ.15 వేలు ప్రతి ఏటా అందించారు. సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నేతలు తల్లికి వందనం పక్కాగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తవుతున్నా ఇంకా డబ్బు ఖాతాల్లోకి జమ చేయకపోతే ఎలా? వెంటనే విధి విధానాలను రూపొందించి తల్లికి వందనాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలి.

– సుమ, హిందూపురం

### రూ.1500పై మాట్లాడరేం?



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నిక హామీల్లో భాగంగా 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావస్తోంది. హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారోనని ఎంతో ఆశగా ప్రజలందరూ ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే మహిళలకు రూ.1500 ఇచ్చి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి.

– షరీఫ్, హిందూపురం

### నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కూటమి నేతలు నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 100 రోజులు కావొస్తున్నా ఇంత వరకూ ఉద్యోగాలు, నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయలేదు. నిరుద్యోగ భృతి కోసం లక్షలాది మంది యువత, నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి అందించాలి. అలాగే ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

– బాబావలి, హిందూపురం

### రైతులను ఆదుకోండి



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఒక్కో రైతుకు పెట్టుబడి సాయంగా రూ. 20 వేల చొప్పున వెంటనే అందించాలి. అధికారంలోకి వచ్చి 100 రోజులు కావొస్తున్నా ఇంత వరకూ రైతులకు ఎలాంటి సాయం అందించలేదు. ఖరీఫ్ సీజన్ పూర్తవుతున్నా ప్రభుత్వం సాయం అందించకపోవడం దారుణం. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలుపుకోవాలి.

– నారాయణప్ప, రైతు, టీడీ పల్లి, రొళ్ల మండలం

### తల్లికి వందనం ఎప్పుడిస్తారు?



అధికారంలోకి వచ్చిన వెంటనే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమ్మఒడి కింద గత ప్రభుత్వ హయాంలో కచ్చితంగా డబ్బులు ఇచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు పూర్తయ్యాయి. పిల్లలకు ఫీజులు కట్టాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఇప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయలేదు. డబ్బులు ఎప్పుడిస్తారో చెప్పాలి.


– రమాదేవి, కల్లూరు, లేపాక్షి మండలం






| నియోజకవర్గాల వారీగా అర్హులు | |
|---|---|
| హిందూపురం | : 76,000 |
| పెనుకొండ | : 76,502 |
| మడకశిర | : 86,200 |
| నెలకు ఇవ్వాల్సిన మొత్తం | : రూ.71.61 కోట్లు |

# హామీలు ఫుల్.. అమలు నిల్





రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్‌కు ఆకర్షితులై నిరుద్యోగులు, మహిళలు, రైతులు ఎంతో ఆశతో కూటమి ప్రభుత్వానికి మద్దతు తెలిపి ఓట్లు వేసి గెలిపించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు కావొస్తున్నప్పటికీ సీఎం చంద్రబాబునాయుడు పథకాలకు సంబంధించి ఎటువంటి కార్యాచరణ ప్రారంభించలేదు. దీంతో ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగాప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం ద్వారా బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు, రైతులకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం, నిరుద్యోగులకు రూ.3 వేల భృతి, మహిళలకు ప్రతినెలా రూ.1500 పంపిణీ ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాల్సి ఉంది. అసలే వరుస కరువులతో అల్లాడిపోతున్న పేద, మధ్యతరగతి ప్రజలు, రైతులు సత్వరమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతున్నారు. – సాక్షిబృందం





| నియోజకవర్గాల వారీగా అర్హులు | |
|---|---|
| హిందూపురం | : 96,242 |
| పెనుకొండ | : 1,15,159 |
| మడకశిర | : 1,05,045 |
| నెలకు ఇవ్వాల్సిన మొత్తం | : రూ.47.46 కోట్లు |



**జగన్ పాలనలో అమ్మఒడి కింద ఏడాదికి అందిన సాయం**

| నియోజకవర్గం | లబ్ధిదారుల సంఖ్య | అందిన సాయం |
|---|---|---|
| హిందూపురం | 32,600 | రూ.48.90 కోట్లు |
| పెనుకొండ | 25,987 | రూ. 38.90 కోట్లు |
| మడకశిర | 23,365 | రూ.33.50 కోట్లు |

**జగన్ పాలనలో రైతు భరోసా కింద ఏడాదికి అందిన సాయం**

| నియోజకవర్గం | లబ్ధిదారుల సంఖ్య | అందిన సాయం |
|---|---|---|
| హిందూపురం | 17,910 | రూ.24.17 కోట్లు |
| పెనుకొండ | 44,769 | రూ.60.43 కోట్లు |
| మడకశిర | 45,763 | రూ.61.78 కోట్లు |

**టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లులకు అందాల్సిన సాయం**

| నియోజకవర్గాల వారీగా అర్హులు | |
|---|---|
| హిందూపురం | : 32,500 |
| పెనుకొండ | : 26,000 |
| మడకశిర | : 32,336 |
| ఇవ్వాల్సిన మొత్తం | : రూ.136 కోట్లు |



**టీడీపీ హయాంలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం**

| నియోజకవర్గాల వారీగా అర్హులు | |
|---|---|
| హిందూపురం | : 17,910 |
| పెనుకొండ | : 80,000 |
| మడకశిర | : 45,763 |
| అందాల్సిన సాయం | : రూ.287 కోట్లు |







మే 7న ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ఇంటర్వ్యూలో సూపర్ సిక్స్ హామీల ప్రస్తావన





మే 5న ఈనాడు దినపత్రికలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇంటర్వ్యూలో హామీల ప్రస్తావన

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే 'కోట'పై జేడీఎస్ జెండా



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**పావగడ:** స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ సొంత హోబళి వైఎన్ హొసకోటకు చెందిన గ్రామ పంచాయతీ అధ్యక్ష స్థానం ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థి రామచంద్రప్ప అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి బుధవారం ఎన్నికలు జరిగాయి. గ్రామ పంచాయతీలో మొత్తం 32 మంది సభ్యులుండగా వారిలో 21 మంది జేడీఎస్‌కు, 11 మంది కాంగ్రెస్ కు చెందిన వారు ఉన్నారు. అయితే ఎన్నికలకు మాత్రం 19 మంది జేడీఎస్, ఆరుగురు కాంగ్రెస్ సభ్యులు హాజరయ్యారు. వారందరి ఏకాభిప్రాయంతో రామచంద్రప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు. రామచంద్రప్ప ఎన్నిక పట్ల స్థానిక మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప హర్షం ప్రకటించారు.

### పేద విద్యార్థికి మెడిసిన్ సీటు



మోహన్

**మడకశిరరూరల్:** వైబీ హళ్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ,కొండప్ప దంపతుల కుమారుడు మోహన్ కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. మోహన్ చదువుకు ఆర్డీటీ సంస్థ సహకారం అందించింది. ఈ సందర్భంగా పలువురు అతడిని అభినందించారు.

### కోట ప్రహరీ కూల్చివేత దోషులను శిక్షించాలి

**పావగడ:** పట్టణంలో ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ప్రాచీన చారిత్రాత్మక కోట ప్రహరీ కూల్చివేత దోషులను శిక్షించాలని స్థానిక ఎస్సీ ఎస్టీ దళిత నాయకులు తహసీల్దార్ వరదరాజును డిమాండ్ చేశారు. మూడు రోజులుగా సంఘటనా స్థలంలో ఆందోళన చేపడుతున్న నాయకులతో తహసీల్దార్ వరదరాజు, మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ బుధవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వాల్మీకి జాగృతి వేదిక నాయకుడు బేకరి నాగరాజు మాట్లాడుతూ గత నెల 19న జరిగిన కోట ప్రహరీ కూల్చివేత సంఘటన సమస్య నేటికీ పరిష్కారం కాకపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. వెంటనే విచారణ జరిపి దోషులను శిక్షించాలని, కోట ప్రహరీని పునఃనిర్మించాలని డిమాండ్ చేశారు.

# ముగిసిన వినాయక నిమజ్జనం

**మడకశిర:** పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమం బుధవారం తెల్లవారు జామున ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం రాత్రి 11 గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది. వినాయక విగ్రహాలను వైఎస్సార్ సర్కిల్ నుంచి మడకశిర చెరువు వరకు ఊరేగించారు. శోభాయాత్రలో చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. శివాలయం వద్ద ఏర్పాటు చేసిన 25 తలల గణేష్ విగ్రహం ఆకట్టుకుంది. ఫోర్‌వీల్ డ్రైవర్స్ అసోసియేషన్, మారుతి నగర్,షిరిడీ సాయిబాబా ఆలయం, వడ్రపాళ్యం తదితర ప్రాంతాల్లో కొలువు దీరిన విగ్రహాలకు చివరిసారిగా పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు రాజ్‌కుమార్, రామారావు బందోబస్తును పర్యవేక్షించారు.





శోభాయాత్రలో ఆకట్టుకున్న 25 తలల గణేష్ విగ్రహం , శోభాయాత్రలో పాల్గొన్న జనం

**రొళ్ల:** ఎం.రాయాపురం పాత బీసీ కాలనీలో కొలువుదీరిన గణనాథుడిని నిమజ్జనం చేశారు. మంగళవారం రాత్రి ప్రారంభమైన ఊరేగింపు బుధవారం తెల్లవారుజామున ముగిసింది. యువకులు డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. తర్వాత వినాయక విగ్రహాన్ని గ్రామ సమీపాన చెరువు వద్దకు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

**అగళి:** మండల కేంద్రంలో బుధవారం వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. గణనాథుడిని విగ్రహాన్ని బెల్లి రథంలో కూర్చోబెట్టి మండల కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగించారు. డప్పు వాయిద్యాల నడుమ యువకులు నృత్యం చేస్తూ రంగులు చల్లుకుంటూ ముందుగా సాగారు. అనంతరం అగళి చెరువులో విగ్రహాన్ని నిమజనం చేశారు.

**పావగడ:** వినాయక చవితి ని పురస్కరించుకుని పట్టణంలో వినాయక నిమజ్జనం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వినాయకుడి భారీ ఊరేగింపులో హిజ్రాల నృత్యం అందర్నీ ఆకట్టుకుంది. యువకులు గంతులేశారు. సాయంత్రం బొజ్జ గణపతిని నిమజ్జనం చేశారు.

# పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం

**రొద్దం:** గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. బుధవారం పెద్దమంతూరులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

**పెనుకొండ:** ప్రతి విద్యార్థి స్వచ్ఛ భారత్‌కు పాటు పడాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. అధ్యాపకులు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, మూర్తి, శివణ్ణ, నరసింహులు పాల్గొన్నారు.

**అమరాపురం:** మండలంలోని గ్రామ పంచాయతీలకు స్వచ్ఛతా హీ సేవా కిట్లను ఈఓఆర్డీ నాగముని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను అక్టోబర్ 2వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పాల్గొన్నారు.

**హిందూపురం:** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ సెక్రటరీ, ఇన్‌స్పెక్టర్లు శంకర్, రత్నం, శ్రీలత, చైతన్య, గిరీష్, లోకేష్, లలిత, ఎంఎస్‌ఓ ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

**పరిగి:** ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారులు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**గోరంట్ల:** స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం గోరంట్ల మేజర్ పంచాయతీలోని పంచాయతీ కార్మికులకు ఒకటవ సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

### పర్యావరణాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త యోగేంద్ర

**హిందూపురం టౌన్:** మానవాళి మనుగడ కోసం పర్యావరణాన్ని కాపాడుకుందామని మైసూరుకు చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సదరన్ రీజనల్ కార్యాలయ శాస్త్రవేత్త యోగేంద్ర పిలుపునిచ్చారు. టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌తో కలసి బుధవారం ఎంజీఎం పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల బయోడైవర్సిటీ కార్యక్రమంలో భాగంగా ఎంజీఎం పాఠశాలను పరిశీలించి, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యత లోపిస్తే ఉత్పన్నమయ్యే ప్రమాదాలను వివరించారు. వాతావరణంలో నీరు, గాలి ఎక్కువగా కాలుష్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రమణ, ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, పీడీ లోక్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### న్యాక్ ఏ గ్రేడ్‌పై విద్యార్థినుల సంబరాలు



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

**హిందూపురం టౌన్:** పట్టణంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ నుంచి ఏ గ్రేడ్ గుర్తింపు లభించడంపై విద్యార్థినులు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల నుంచి విద్యార్థినులు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి మాట్లాడుతూ తమ కళాశాల సాధించిన 'ఏ' గ్రేడ్ తమ నిరంతర కృషికి, అత్యున్నత ప్రతిభకు నిదర్శనమన్నారు. ఏ గ్రేడ్ ద్వారా తమపై మరింత బాధ్యత పెరిగిందని, తల్లిదండ్రులు, ప్రజానీకం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటామని తెలిపారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, దాతలు, పూర్వ విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది తోడ్పాటు తమ విజయానికి దోహదపడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ యశోద, శ్రీధర్, భోజప్ప, పార్వతి, రవినాయక్, సరస్వతి, ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**పాఠశాల ఆకస్మిక తనిఖీ**

**అమరాపురం:** వలస జెడ్పీ ఉన్నత పాఠశాలను డీవైఈఓ రంగస్వామి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలో వచ్చిన మార్కులను, వారు రాసిన జవాబు పత్రాలను పరిశీలించారు. ఏఏ విద్యార్థులు ఏఏ స్థాయిలో ఉన్నారు తదితర వివరాలను సేకరించారు. అనంతరం సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పదోతరగతి విద్యార్థులను పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమరాపురంలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలను పరిశీలించారు.

**బాలుడికి తీవ్ర గాయాలు**

**పెనుకొండ:** రొద్దం మండలం సానిపల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన వడ్డే వెంకటేష్ (13) గ్రామ సమీపంలోని రహదారి వద్ద మొక్కజొన్న కంకుల వద్ద కాపాలా ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన కురుబ వెంకటేష్ అనే వ్యక్తి కారులో వస్తూ బాలుడిపై ఎక్కించాడు. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి**

**రొళ్ల:** మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు కోసం తప్పనిసరిగా ఈ-కై వేసీని చేయించుకోవాలని వీఏఏలు ప్రసన్న కుమార్, అపర్ణ తెలిపారు. బుధవారం కొడగార్లగుట్ట, కొడగార్లగుట్ట కాలనీ, బీజీ హళ్లి పంచాయతీలోని వివిధ గ్రామాల్లో ఈ-కేవైసీ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ-పంట, ఈ-కేవైసీ నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే వాతావరణ బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**రక్తదాన శిబిరం**

**పెనుకొండ:** పట్టణంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. బీజేపీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాలగోపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ శిబిరాన్ని పర్యవేక్షించారు. వికసిత భారత్ నిర్మాణానికి ప్రధాని మోదీ అడుగుజాడల్లో నడుస్తామని నాయకులు పేర్కొన్నారు.

**ఉత్సాహంగా క్రీడాపోటీలు**

**గోరంట్ల:** స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో బాలికలకు మండల స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్- 17 విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో కీర్తన, వైష్ణవి, దివ్య తొలి మూడుస్థానాల్లో నిలిచినట్లు పీడీ రామ్మోహన్ తెలిపారు. అండర్- 14 విభాగంలో దివ్య, కళ్యాణి, హేమశ్రీ విజేతలుగా నిలిచారన్నారు. అండర్-17 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో బృంద మొదటి స్థానం,అండర్ 14 విభాగంలో శిరేఖ మొదటి స్థానంలో నిలిచారన్నారు. అండర్- 17 విభాగం వాలీబాల్‌లో ట్రైబల్ పాఠశాల విన్నర్స్‌గా నిలిచినట్లు ఆయన వివరించారు.

**రాగి సాగుపై అవగాహన**

**గుడిబండ:** స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం రాగి పంట సాగుపై వ్యవసాయ విస్తరణ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ సనావుల్లా మాట్లాడుతూ రాగి సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేసి పంట సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. అనంతరం బూదిపల్లిలో రైతు రామకృష్ణ ప్రకృతి వ్యవసాయ పద్ధతుతో పండించిన ఏ గ్రేడ్ మోడల్ కూరగాయల పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ వీరనరేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు, పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

**వినాయక నిమజ్జనానికి ఆహ్వానం**



గణనాథుడి నిమజ్జనానికి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

**గుడిబండ:** అగళి ఎస్సీకాలనీలో ఈనెల 21న జరిగే గణనాథుడి నిమజ్జనోత్సవానికి రావాలని కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పను కోరారు. ఈమేరకు బుధవారం ఫళారం గ్రామంలో ఆయన్ను కలిసి ఆహ్వానించారు. ఈసందర్భంగా మండలంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈరన్న, రఘు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా హిందీ భాషా దినోత్సవం**

**పెనుకొండ:** స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ యశోదరాణి, హిందీ అధ్యాపకులు హరి ప్రసాద్ హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు. సమావేశంలో అధ్యాపకులు ప్రతాప్, రామన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

**హిందూపురం అర్బన్ :** స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. హిందూపురం మండలం మలుగూరు గ్రామ సమీపంలో ఈ నెల 13న నడుచుకొంటూ వెళుతున్న బాబన్న (55)ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ పోలీసులు తెలిపారు.

**దొంగ అనుకొని చితకబాదారు!**

**సోమందేపల్లి:** చాకర్లపల్లి గ్రామంలో ఓ యువకుడిని స్థానికులు చితక బాదిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఉత్తర భారత్‌కు చెందిన ఓ యువకుడు గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో దొంగగా భావించి చెట్టుకు తాళ్లతో కట్టేసి చితకబాదారు. తర్వాత ఫ్యాక్టరీలో పని చేసే కార్మికుడిగా గుర్తించి విడిచిపెట్టారు.